
4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 17 జూన్ 2024
www.ntnews.com

# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com




## నిద్రతో యుద్ధం

నిద్రతో శతృత్వం
తేలిక విషయం కాదు..
తెలిసో... తెలియకో...
నీపై నీవే ఓ యుద్ధభేరిని మోగించి ఉంటావు.

నీలో బలం, బలహీనతల మధ్య
ఒంటరిగా కేవలం కలను పుల్లగా పట్టుకొని
ఒట్టి ఊహల బెండుల నడుమ నిలబడి
పారిపోలేక, తప్పించుకోలేక ఒక్కడివే

నిద్రతో కలబడుతూ
రాత్రి కింద నలుగుతూ
మత్తులో మెలిక పడుతూ
చిత్రవధ అనుభవిస్తూ

రోజూ ఓ పగటి కలతో
రాత్రి గుండెల్లో దూరి
నిలబడలేక, నిలువలేక
నీ లోపాన్ని మోయలేనంత
సోమరితనంతో స్నేహం చేసి

చురుకుదనం చెరుపుకొని
మంచం తిట్టుకునేలా
దుప్పటి దుమ్మెత్తిపోసేలా
నీ లోపల ఒక్కడివే కుములుతూ


పగటికి భయపడి
బయటకు సిగ్గుపడి
చీకటిలోనే నిద్రకు వెలికాబడి
మెలకువ తెలియని మెలుకువతో
ఈ యుద్ధం ఎన్నాళ్లు?



శ్రీ సాహితి
97044 37247

# ప్రజా కళాజ్యోతి పాలడుగు నాగయ్య

**పాటతో పాటు ప్రజా కళా రూపాల ద్వారానే సమాజంలో సత్వరం గొప్ప సాంస్కృతిక చైతన్యాన్ని కలిగించవచ్చు. ఈ విధమైన కళా, సాంస్కృతిక ఎరుకతో పదునైన పాటలతో, బుర్ర కథలతో, గేయ రూపకాలతో సమాజాన్ని చైతన్యపరచిన కవి, ప్రజా వాగ్గేయకారుడు పాలడుగు నాగయ్య. తెలంగాణ తొలితరం ప్రజా కళాకారులకు నేటి కవులకు ఒక వారధిగా నిలిచిన నాగయ్య రచనలను అధ్యయనం చేస్తే జాతి సముద్ధరణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల త్యాగాల చరిత్ర బోధపడుతుంది.**



**'సత్యనిష్ఠతో** జీవితాన్ని చిత్రిస్తూ, ప్రగతి కోసం, ప్రజల కోసం, పీడిత వర్గాల విముక్తి కోసం, రచయితలు పాటుపడాలని' చాటిచెప్పిన నాగయ్య ఈ బృహత్తర ఆశయంతో మునుముందుకు సాగిపోయాడు. గేయాన్ని బుర్రకథను ప్రధాన ఆయుధాలుగా చేసుకొని సాంస్కృతిక విప్లవ సమరం సాగించాడు. 'వినరా ఆంధ్రుడ! వీర కుమార' అంటూ వీరయోధుల, జ్ఞానవీరుల కథలను జనావళికి చేరువ చేశాడు. పాలడుగు నాగయ్య ఖమ్మం జిల్లా రామాపురంలో 1943, జూలై 19న ఈరయ్య, తిర్పమ్మ అనే నిరుపేద దంపతులకు జన్మించాడు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన నాగయ్య, సూర్యాపేట సమీపంలోని కుడకుడ గ్రామంలో అమ్మమ్మ, మేనమామల ఆలనా పాలనలో పెరిగాడు. కుడకుడ, సూర్యాపేటల్లో తొలుత విద్యనభ్యసించి, హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తిచేశాడు. ఆ తర్వాత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ తక్కువ కాలంలోనే కళాకారుడిగా, కవిగా, గాయకుడిగా, నటుడిగా, దర్శకుడిగా తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన నాగయ్య నాలుగు పదుల వయస్సు దాటకుండానే తీవ్ర అనారోగ్యంతో 1982, ఏప్రిల్ 10న మరణించాడు.

అంటరానితనం, పేదరికం నడుమ నాగయ్య బాల్యం నలిగిపోయింది. దుర్భర దారిద్ర్యం ఆయనను పశువుల కాపరిగా మార్చింది. పాలబుగ్గల జీతగాడై నాగయ్య పొలం పనులు చేశాడు. పనితో పాటు పాట నేర్చుకున్నాడు. తన స్వగ్రామం సమీపంలో చింతచెట్ల నీడలో సేదతీరాడు. మూసీ కాలువ గట్ల వెంట, గుట్టల పొంటి దోస్తులతో జతగూడి ఆటలాడాడు. ఈ ఆటపాటల నేపథ్యం ప్రేరణతో, గ్రామీణ సాంస్కృతిక కోలాహలం లోనుంచి నాగయ్యలో కళాభిరుచి చిగురించి, ప్రజా రంజకంగా ఫలించింది. పిట్టలదొర, పకోడీవాలా లాంటి విచిత్ర వేషధారణ పోటీల్లో నాగయ్య రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులను సాధించాడు. పాలేరు నాటకంలో బాలపాత్ర ధరించి శభాష్ అనిపించుకున్నాడు. అనేక సందేశాత్మకమైన సంగీత రూపకాలతో, బుర్రకథలతో ఆకాశవాణి, దూరదర్శన్‌లలో సమర్థుడైన కళాకారుడిగా నాగయ్య పేరుగాంచాడు. జాతీయ గేయాలు, పాలడుగు పదాలు, పల్లె జనపదాలు, ఐకమత్యం గేయరూపకం వంటి రచనలను వెలువరించాడు.

**సామాజిక చైతన్యభరితమైన సందేశాత్మకమైన పాటలు, పదాలు, దేశభక్తి గేయాలు, జానపద గేయాలు, భక్తిగీతాలు రచించడంతో పాటు ఆ గేయాలకు భావానుకూలమైన స్వరాలు కూర్చి నాగయ్య తన గానంతో ప్రేక్షకులను రంజింపజేశాడు. గ్రామీణ వనితల శ్రమకు జేజేలు పలుకుతూ పదాలల్లాడు.**

సూర్యాపేట పరిసర ప్రాంతాల జాతరలను, పోచమ్మ వంటి గ్రామ దేవతలను, దేవుళ్లను వర్ణిస్తూ జానపద గీతాలను రాశాడు. 'దున్నరా నవయువకా దున్నరా' పాటలో సరికొత్త రూపకాలతో ఉదాత్తమైన సందేశాన్ని అందించాడు. 'శాంతి సత్యముల నెడి ఎద్దులను కట్టి, క్రాంతి అనే నాగలితో, వేదాల మడులన్నీ విరివిగా దున్నాలని, విజ్ఞాన విత్తనాలు వెదజల్లాలని, నీతి అనే ప్రాజెక్ట్ నుంచి నీరు పెట్టి, న్యాయమను కాలువగుండా నీరు ప్రవహించాలని, ధర్మమనెడి మంచెనెక్కి కాపు కాయాలని, దయారసముల కొడవలితో దండిగా కోయాలని (దున్నరా) వ్యవసాయ పనుల ద్వారా నైతిక విలువలను ప్రబోధించాడు. పండిన ధాన్యాన్ని 'పరులెల్లరు బ్రతుకుటకును నలుదిక్కుల వెదజల్లి', నవవిశ్వపు జనావళి మనములలోన నాటాలని' ప్రగతిశీల దృష్టితో నాగయ్య పిలుపునిచ్చాడు. 'మనిషిలోని ద్వేషాగ్ని మాసిపోవాలని, మమత పండాలని, ప్రేమ నిండాలని (మనిషి మారాలి) శ్రామిక జీవులు కలవాలని, శ్రేయోరాజ్యం రావాలని' అభిలషించాడు. 'నావ నడుపురా', 'ముందుత్రోవ కనరా' వంటి అనేక తాత్త్విక గీతాలతో జీవన పరమార్థాన్ని తెలియజేశాడు. 'దస్తీ ఓ నా దస్తీ' అంటూ వైవిధ్యభరితమైన లఘు గేయాలను ఆలపించాడు.

**'నాగయ్య స్వయం కృషితోనే సంగీతం, సాహిత్యం, నాట్యం కూడా అభ్యసించి, ఈ మూడు కళలకు నిలయమైన బుర్రకథను చేపట్టి, ఆధునిక మహా పురుషులను, ఉద్యమాలను, ఉన్నత మానవ లక్ష్యాలను దేశం నలుమూలలకు, ప్రజా ప్రాంగణాలకు తీసుకుపోతున్నారని' డాక్టర్ బోయి భీమన్న కితాబిచ్చినట్టుగా బహుముఖీన కళాప్రతిభతో బుర్రకథలను ప్రదర్శించి నాగయ్య జనావళిని జాగృతపరిచాడు.**

'ఎవరిది ఎక్కువ కులము /ఎవరిది తక్కువ కులము /ఎంచి చెప్పగా ఎవరికేమెరుక?' అని వేమన, పోతులూరి వీరబ్రహ్మం లాంటి సామాజిక తత్త్వ కవుల్లాగా నాగయ్య ప్రశ్నించాడు. 'మనము తక్కువ, మనము బానిసలము' అనే మానసిక బానిసత్వాన్ని విడనాడాలని దళితులకు హితవు చెప్పాడు. పురాణాల్లో, భారత రామాయణ గ్రంథాల్లో వశిష్ఠుడు, పరశురాముడు, అరుంధతి, రేణుక లాంటి శూద్ర పాత్రలను ఒకవైపు ఉన్నతంగా ఆరాధిస్తూనే, మరొకవైపు దళిత బహుజనులను హీనంగా దూషించే మనువాదుల ద్వంద్వ వైఖరిని ఈ నృత్య నాటికలో తిరుగులేని వాదనాపటిమతో ఆయన వ్యతిరేకించాడు. 'దళితుల శ్రమపైనే భారతీయ సాంస్కృతిక జీవితం ఆధారపడి ఉన్నదన్న' అంబేద్కర్ మాటలతో నాగయ్య ఈ నృత్యనాటికను ముగించటం విశేషం. 'బడుగువర్గాల స్థితి బాగుపడినప్పుడే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుందన్న అంబేద్కర్ సందేశాన్ని ఈ నాటిక ద్వారా నాగయ్య ప్రచారం చేశాడు. డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ప్రతిపాదించినట్టుగా 'తెలంగాణలో అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవడానికి తన వంతు కృషిచేసిన సాహితీవేత్తగా నాగయ్యను గుర్తించాల్సిన అవసరం' ఉన్నది.

**నిబద్ధత కలిగిన ప్రజా నాయకుడిగా నీరాజనాలందుకున్న దామోదరం సంజీవయ్య ఆదర్శనీయమైన జీవితాన్ని, ఆ మహానాయకుని రాజనీతిని కొనియాడుతూ నాగయ్య రాసిన బుర్రకథ ఎంతో ప్రజాదరణ పొందింది. ఈ బుర్రకథను నెలరోజుల పాటు రాయలసీమ గ్రామాల్లో ప్రదర్శించి అక్కడి ప్రజల అభినందనలను అందుకున్న నాగయ్యను తెలంగాణ నాజర్‌గా అభివర్ణించవచ్చు.**

అట్టడుగు వర్గంలో పుట్టిన సంజీవయ్య కఠోరమైన దీక్షతో కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించి, జాతీయ నాయకునిగా ఎదిగిన క్రమాన్ని బుర్రకథగా నాగయ్య మలిచిన తీరు అమోఘం. పంచాయితీ రాజ్యంబులోన అధికార వికేంద్రీకరణ అమలు జరిపిన నాయకునిగా, పేదరికము బాపగ ప్రగతికి నాంది పలికి, ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను పేదలకు పంచిన సంజీవయ్యను గొప్ప సంస్కర్తగా, ఆదర్శ ముఖ్యమంత్రిగా కీర్తించాడు. 'మీ సారస్వత విలువలను మరువలేమయ్యా' అంటూ దామోదరం సంజీవయ్య చేసిన భాషా సాహిత్యాల కృషిని కూడా ఈ బుర్రకథలో నాగయ్య గానం చేశాడు. యాభయ్యేండ్ల కిందట రాసిన పాలడుగు నాగయ్య రచనలకు, తీర్చిదిద్దిన కళారూపాలకు ఈనాటికీ ఎంతో ప్రాసంగికత ఉన్నది. తండ్రి కళారక్తం పంచుకుపుట్టిన కళాకారిణి, పాఠశాల విద్యాశాఖలో సంయుక్త సంచాలకులైన శ్రీమతి పాలడుగు సరోజినీదేవి నాగయ్య సమగ్ర సాహిత్యాన్ని పునర్ముద్రించి కొత్త తరం పాఠకులకు అందించటం అభినందనీయం. వారసత్వమంటే తండ్రి స్థిరాస్తులను పంచుకోవడం కాదు, ఆయన సిరాస్థులను, కళా సంపదలను పంచుకొని ప్రచారం చేయడమే నిజమైన వారసత్వం.



డాక్టర్ కోయి కోటేశ్వరరావు
94404 80274




## ఏరువాక పున్నమి

మడిని,
ధాన్యపు
ఒడిగా మార్చేందుకు
నాగలి కర్రు భూమి పొరలతో చేతులు కలిపినది నేడు,

మట్టి గట్టితనాన్ని
తట్టి నలిపి
జీవశక్తిగా మార్చేలా
ఎద్దుల గిట్టలు
తాండవమాడిన రోజిది,

రైతు భగీరథుడై
తెచ్చిన
నీళ్ళధార
ప్రాణదాతై
నేలకు ఊపిరినింపినది నేడు,

మనిషి మనుగడకై
తపస్సు చేసి మన్ను,
గింజకు అన్నానికి మధ్య
మధ్యవర్తిత్వం వహించిన దినమిది,

ఆకాశంలోని చంద్రుడు
పున్నమి రూపం దాల్చి
భూమిని కలువ చేసి
ముద్దాడిన రోజిది,

నోరుదాక అన్నం పుట్టే
ఏరువాక పున్నమి నేడు,
ఈ రాత్రి
నేను,
చంద్రునిలో నిండైన రైతుని
చూస్తున్నాను!!




డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు
94414 06252

# భాషా పరిరక్షణకు పునాది బాల సాహిత్యం

'భాష్యతే ఇతి భాషః!' భాషింపబడునది భాష. ఉన్నత విద్యకు, వ్యక్తిత్వ వికాసానికి, పునాదులు వేసేది భాష. పిల్లల ఊహలకు రెక్కలు తొడుగుతూ అభివృద్ధికి బాటలు పరిచేది భాష. భాష ముందుతరాలకు అందాలంటే, భాష బతికి బట్టకట్టాలంటే దానికి సాహిత్యం తోడ్పాటు అవసరం. హితంతో కూడుకున్నదే సాహిత్యం. (స హితస్య సాహిత్యం). మంచి విషయాలను నేర్పే సాహిత్యం ఏ కాలానికైనా అవసరమే.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బాల సాహిత్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెరిగింది. ప్రభుత్వంతో పాటు వివిధ సంస్థలు బాలల కోసం, బాలల సాహిత్యాన్ని సృజన చేస్తున్న పెద్దలకు సాహిత్య కార్యశాలలు ఏర్పాటుచేశాయి. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహిత్య కార్యకర్త గరిపెల్లి అశోక్ సంపాదకత్వంలో 2016లో ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాల పిల్లల కథల పుస్తకం 'జాంపండ్లు' వెలువడింది. బాల సాహిత్య పరిషత్తు, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సారస్వత పరిషత్తు, రంగినేని ట్రస్ట్, బాలచెలిమి, మంచి పుస్తకం, బాల గోకులం, మాడభూషి రంగాచార్య స్మారక ట్రస్ట్, కంచర్ల గోపన్న సాహితీ సమాఖ్య, పెందోట బాలసాహిత్య పీఠం, సుగుణ సాహితీ సమితి లాంటి ఎన్నో సంస్థలు బాలసాహిత్య కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా బాలలకు రచనా పోటీలు నిర్వహించి బహుమతులను ఇచ్చి ప్రోత్సాహం అందిస్తున్నాయి. కొన్ని సంస్థలు బాలసాహిత్యం సృజిస్తున్న వారికి బిరుదులు ఇస్తూ గౌరవిస్తున్నాయి. మరికొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు వ్యక్తిగతంగా పిల్లల రచనలను పుస్తకరూపంలో తీసుకొని వస్తున్నారు. పిల్లల లోకం బాల సాహిత్య వేదిక వారు ఒక అడుగు ముందుకేసి 2017లో పిల్లలకు వీడియో కథల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో మా పాఠశాల విద్యార్థి వెన్నెలకు ప్రథమ స్థానం రావడం ఇంకా మదిలో మెదులుతూనే ఉంటుంది.

2017లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలలో బాల సాహిత్యానికి ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసి గౌరవాన్ని కల్పించింది. 2020లో మణికొండ వేదకుమార్ పిల్లల కథలను సేకరించి చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ తరపున పాత పది జిల్లాల వారీగా ప్రచురించారు.




2022లో తెలంగాణ సాహిత్య అకాడమీ పాఠశాల విద్యాశాఖ సహకారంతో 'మన ఊరు-మన చెట్టు' పేరుతో విద్యార్థులకు కథల పోటీని నిర్వహించింది. అకాడమీ వారి లెక్కల ప్రకారం ఐదు లక్షల మంది బాలలు ఈ మహత్తర కార్యక్రమంలో పాలు పంచుకొని స్వీయ రచనలు చేశారు. ఉత్సాహం కలిగిన కొందరు ఉపాధ్యాయులు తమ పాఠశాల విద్యార్థుల కథా సంకలనాలను ప్రచురించారు. చాలా కథలు అకాడమీ వారి వద్ద భద్రంగా ఉన్నాయి.

భాషా సాహిత్యాల పరిరక్షణ కోసం 1943లో ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తు (ప్రస్తుత తెలంగాణ సారస్వత పరిషత్తు) తెలుగు భాషా పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల ప్రదానంతో పాటు అనేక గ్రంథాలను ప్రచురించింది. తెలుగు భాషా పరిరక్షణకు నిర్విరామ కృషి చేస్తూనే ఉన్నది. పెద్దవారికి సంబంధించిన సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తూ వస్తున్న పరిషత్ గత మూడేండ్ల కిందటి నుంచి బాల సాహిత్యంపై దృష్టి నిలపడం హర్షించదగిన పరిణామం. గతంలో తెలుగు భాషోపాధ్యాయుల సమ్మేళనం నిర్వహించి మాతృభాషకు పట్టం గట్టిన పరిషత్తు ఈ నెల 29, 30 తేదీలలో 200 మందికి పైగా బాల సాహితీవేత్తలతో, పిల్లలతో, తెలుగు ఉపాధ్యాయులతో, భాషాభిమానులతో పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డి సౌజన్యంతో మాతృమూర్తి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం ఘనంగా నిర్వహించింది. గతేడాది రెండు తెలుగు రాష్ట్రాల్లోని బాల రచయితల నుంచి ఆహ్వానించిన కథల్లో ఎంపిక చేసిన కథలతో ఒక సంకలనాన్ని, బాలల కోసం కథలు రాసే పెద్దల నుంచి కథలను ఆహ్వానించగా వచ్చిన కథలలో ఎంపిక చేసిన కథలతో ప్రచురించిన నాలుగు సంకలనాలను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు.

భాషా సాహిత్య వైభవం, ఆరోగ్యం-విజ్ఞానంతో పాటు మరికొంత మంది బాల సాహితీవేత్తల పుస్తకాలూ ఆవిష్కరించారు. అంతేకాక ఉత్తమ కథలు రాసిన బాల సాహితీవేత్తలకు, బాల కథకులకు నగదు పారితోషికం అందించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్యలు చక్కటి రూపకల్పనతో 'బడిలో తెలుగు భాష', 'పత్రికలు బాలసాహిత్యం' పేర చర్చాగోష్ఠులతో పాటు 'కథ చెప్పే కళ', 'లలితకళా పరిచయం', 'బాల సాహిత్యం-ప్రమాణాలు', 'బాలసాహిత్యం-గ్రంథాలయాలు' పేరిట సదస్సులను నిర్వహించారు.


ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీతలు డాక్టర్ దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, ప్రముఖ బాలసాహితీవేత్తలు వీఆర్ శర్మ, గరిపల్లి అశోక్, పైడిమర్రి రామకృష్ణ, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, సీఏ ప్రసాద్, శాంతారావు, మహమ్మద్ షఫీ, కథల తాతయ్య ఎన్నవెల్లి రాజమౌళి, డాక్టర్ బీవీఎన్ స్వామి, డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, కూకట్ల తిరుపతి, ఉండ్రాళ్ల రాజేశం, గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ, ముంజులూరి కృష్ణకుమారి, డాక్టర్ అమరవాది నీరజ, మణికొండ వేదకుమార్, బైసా దేవదాసు, డాక్టర్ నమిలేటి కిట్టన్న, టి.వేదాంతసూరి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డి తదితర భాషాభిమానులు బాల సాహితీవేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

రెండురోజుల సదస్సులో వక్తల అభిప్రాయాలను క్రోడీకరిస్తే ఆంగ్లభాష, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ లాంటి సాంకేతిక విప్లవం కారణంగా నేటి బాలలు మాతృభాషకు దూరమవుతున్నారని, మన మాతృభాష అయిన తెలుగును కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉన్నది. మార్పు ముందుగా తెలుగువారి ఇంటినుంచే ప్రారంభం కావాలి. గతంలో కన్నా బాలలు సాహిత్య సృజన బాగా చేస్తున్నారు కాబట్టి పత్రికా ఎడిటర్లు కూడా వారికి ప్రోత్సాహం ఇవ్వాలి. చదువంటే కేవలం పాఠ్యపుస్తకాల్లో ఉన్నదే కాదని, బయటి పుస్తకాలను కూడా చదువాలని, వాటితో పాటు కళల పట్ల అభిరుచిని కూడా పిల్లల్లో పెంపొందించాలి. పిల్లల మానసిక స్థాయికి తగిన ప్రామాణిక బాల సాహిత్యాన్ని రచయితలు అందించాలి. పాఠశాల గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకోవాలి. కథను చెప్పే కళను పిల్లలకు నేర్పించాలి. భాషా పరిరక్షణకు బాల సాహిత్యమే పునాది. కాబట్టి మంచి బాల సాహిత్యాన్ని సృష్టిస్తూ కాపాడుకోవాలి.

నేటి బాలలే రేపటి పౌరులు, దేశ సంపదకు వారసులు. అందుకే భాషా సాహిత్య సంపద ముందుతరాలకు అందాలంటే బాల సాహిత్యాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ బాధ్యతను భుజాలకెత్తుకున్న వ్యక్తులను, సంస్థలను అభినందించాల్సిన అవసరమూ ఉన్నది.



గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ
79896 63675



## పాత్రలు


పాత్రలు ఉరుములై మాట్లాడాయి
పాత్రలు ఉడికిన సముద్రాలై మాట్లాడాయి
కొన్ని పాత్రలు
ఫెటేల్మని పగిలి ఆకాశానికి
వెదజల్లే అగ్నిపర్వతాలై మాట్లాడాయి
కథలోని పాత్రలు కావు
పాత్రల్లోని జీవితాలు మాట్లాడాయి
పాత్రలే మాట్లాడాయి
నేపథ్యాలు మాట్లాడాయి
పాత్రల్లో ఔన్నత్యం పాత్రల్లో వ్యక్తిత్వం
కులంతో రాదు మతం మీద ఆధారపడదు
ప్రాంతంచే ముడిపడదు
కక్షలు వివక్షలు పాత్రలై
ఎదిరింపులు బెదిరింపులు పాత్రలై
నిశ్శబ్దం బద్దలు చేస్తూ అమరత్వం గానం చేస్తూ
వేరే కొన్ని పాత్రలు
సుసంపన్న ప్రపంచానికి పాద ముద్రలు వేస్తూ
మరికొన్ని పాత్రలు
దుఃఖ విముక్తులను చేసే మార్గాన్వేషణలో
కాలం విసిరిన సవాళ్లకు ఇరుపక్షాల మధ్య
నిలబడ్డ వారధీ ఒక పాత్రే
మహా పాత్రే



కోటం చంద్రశేఖర్
94920 43348

### ఆవిష్కరణ

**తెలంగాణ** రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గడ్డం సులోచన రాసిన 'మాటల చెట్టు' కవితా సంపుటి ఆవిష్కారం కానున్నది. 2024, జూన్ 22 శనివారం ఉదయం 10 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో డాక్టర్ నందిని సిధారెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమంలో మామిడి హరికృష్ణ, నాళేశ్వరం శంకరం, ఉదారి నారాయణ, బెల్లంకొండ సంపత్‌కుమార్ పాల్గొంటారు. గడ్డం సరోజిని, గడ్డం రంగారెడ్డి అంకితం స్వీకరించనున్నారు.



## మనుషులు కావాలి

జీవితంలో అలసిపోయి
నాలుగు గోడల మధ్య
గడియారంలా వేలాడుతూ
సమయాన్ని లెక్కించేవాళ్లకు
యంత్రాలు కాదు
ఇప్పుడు మనుషులు కావాలి!

మనసు పంచుకోడానికి
మాటలు వినడానికి
భారం దించుకోడానికి
తోడు కరువైన లోకంలో
ఇప్పుడు మనుషులు కావాలి!

ముఖాలు చూసుకోకుండా
మాటలు పట్టించుకోకుండా
కాలంతో పాటు పరుగులు తీసే
నేటి కాలపు మనుషులకు
కాస్త మనిషితనం గుర్తుచెయ్యాలి!

మనుషుల లోకంలో
మనుషులే మాయమైపోతున్న
కాలం
కాస్త ఆగి చూడండి
మనుషులు దిక్కు లేకుండా
ఎలా కొట్టు మిట్టాడుతున్నారో!

ఎంత ఎత్తులకు చేరినా
ఎంత సంపాదించుకున్నా
మనుషుల్లేని బంధాలు
వస్తువులతో ఉంటాయా,
కాస్త భ్రమలు వీడి
మనుషులతో కలవండి
మనుషులను మనుషులుగా
కాస్త బతకనివ్వండి!



పుట్టి గిరిధర్
94949 62080

### ఆహ్వానం

**హైదరాబాద్**, ఆబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో 2024, జూన్ 19 బుధవారం సాయంత్రం 5 గంటలకు 'చింతలపల్లి నిర్మలాదేవి-నారాయణరావు జీవన సాఫల్య పురస్కారం 2024' ప్రదానోత్సవ కార్యక్రమంతో పాటు, 'మన కల నిజం' పుస్తకావిష్కరణ కార్యక్రమాలు జరుగనున్నాయి. నాగవరం బాల్‌రాం పురస్కారాన్ని స్వీకరించనుండగా, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 'మన కల నిజం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. చింతలపల్లి భాస్కరరావు, ఘంటా చక్రపాణి, ఒబేదుల్లా కొత్వాల్, జుర్రు చెన్నయ్య, చింతలపల్లి చంద్రకళ-భాస్కర్‌రావు, చింతలపల్లి మాధవి-రామచంద్రరావు, రంగినేని సుమతి-విజయమోహన్‌రావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.